పంతులవారి పరలోకయాత్ర

పసుమర్తి కృష్ణమూర్తిగారు

మాయింటికిఁ బొరుగున నొకపంతులుగా రుండెడివారు. వారు నియోగులు, మేము వైదికులము. వారిది పెద్దమిద్దె; మాది చిన్నయిల్లు. వారు మంచిగొప్ప యుద్యోగముగలవారు: పెద్ద యాస్తిపరులు—చూకవేవియు లేవు. శ్రీపంతులుగారు మంచి మతాభిమానులనుమాట తరుచుగా వినఁబడుచుండును. దొరలు సులభముగా నుచ్చరింపఁ గలిగియుండుటకు "మిస్టర్ స్యామ్" అని వారిపేరు, వారియింటి యావరణగోడమీద నొక చిన్న బల్లపైఁ జిత్రింపఁబడి యంటింపఁబడి యున్నది; కాని వారి సరియైన పేరు శ్యామసుందరరావుగారు. ఇంటియొద్దఁ జూచునపుడు విభూతిరేఖలు, రుద్రాక్షమాల, పట్టెడు జందెములు—"ఆహా! సాక్షాత్తు రుద్రులు! రుద్రులు! రుద్రులే" యని వారి యాశ్రితకోటిలో ముఖ్యులగు సోమయాజులుగారు 'ఢంకాకొట్టి' చెప్పుటలో నతిశయోక్తి యెంతయు లేదు; కాని, వారినిఁ గార్యాలయమునఁ జూచినవారు మాత్రము "ఆంగ్లో యిండియను" అనుకో వచ్చును. అదియొకతప్పా! దూరస్థులకు యథార్థము తెలయకుండుట తప్పుకాదు. అట్టివారు శ్రమయనక మహారాజశ్రీ పంతులవారి యింటికిఁ బ్రాతఃకాలమందువచ్చి యొకసారిచూతురేని, మావలెనే సోమయాజులవారి 'ఢంకా'కు వారును పక్కతాళము వేయకమానరు. పద్దెములఁ గురిపింతురు. పత్రికలలో నెగురవేయుటకుఁ బూనుదురు. నిజమే! ఒకవంక దేవతార్చనగంట, యొకవంక స్వస్తివాచకములు: మరియొకచోటఁ బంతులుగారును సోమయాజులుగారును గలసిచేయు నుపనిషత్పారాయణము: "ఆహా! యెట్టి నాస్తికుఁడైనను మాయింటికివచ్చి రెండుపూటలుంటే ఆస్తికుఁడు కాకుండడు" అని పంతులవారు పలువురితోనను మాటసత్యము, ముమ్మాటికి సత్యమే! అందువలననే యోపికలేని మేము "మీరు వట్టినాస్తికులు ఫూల్స్" అని వారు మాయెడఁగల యభిమానముచేఁ దిట్టుచుండినను మారు పలుకక నోరుమూసికొని యూరకొనుచుందుము. సర్వవిధముల బలవంతులగు వారితో మాకేల! అట్టివారుపకారముజేసినఁ జేయవచ్చు లేకున్న మానవచ్చుఁ గాని యపకారము మాత్ర మతిసులభముగాఁ జేయుదురని మాభయము. ఐనఁ బంతులవారట్లు చేయుదురని కాదు—లోకపరిపాటి చెప్పితిమి. అదియటుండ నీకఁ బంతులవారి సంసారము సంగతి యేమని యడుగుదురేమో? అదిమాకుఁ దెలియదు; కాని, మాయిల్లాలుమాత్రము పలుమారు కొనియాడుచుండుట వినియున్నాము—"ముసలికాలానికి పంతులు మూడో పెళ్లి చేసుకొన్నా!—పిల్లమాత్రం బంగారం!!" అని: మరియుఁ బంతులవారి ప్రథమకళత్రజుని, ద్వితీయాకళత్రజను మాత్రము నే నెరుగుదును. వారు పుట్టుట మాత్రం మాపొరుగుననే కాని, పెరుగుట పెండ్లిండ్లగుట మొదలగునవి యన్నియు మేనమామల యిండ్లనే. ఇపుడుగూడ వారిచట లేరు. ఈయమ్మాయిగారును జిన్నపిల్లకాబట్టి తరుచుగాఁ బుట్టింటనే యుండును:—విజయనగరందగ్గర నేదోయొక చిన్న యూరు.

ఒకనాడు మధ్యాహ్నమున రెండుగంటల సమయమునఁ బంతులవారు కార్యాలయమునుండి యాకస్మాత్తుగ నింటికి దయచేసి, నాకును సోమయాజులుగారికిని మరెవరికో యొకరిద్దరికిని వర్తమానమంపిరి. మేమును వెంటనే వారిదర్శనమునకై వెళ్లితిమి. అపుడు వారొకపత్రమును జదువుమని నాచేతికిచ్చిరి. అందులో మరేదియు నేను జూచియుండలేదు; మున్ముందుగఁ బంతులవారికొక గొప్పబిరుదము వచ్చియుంటఁ జూచితిని: దానిక్రింద నొక నీలిరంగుగీటు పెట్టఁబడియుండెను. నే నా వార్త నచట సదస్యులగు సోమయాజులు మొదలగువారికి సావధానముగా నెరింగించితిని. విన్నవారందరిలో సోమయాజులుగారు మాత్ర

ములికిపడి "యెంతపనైంది! ఎంతమాట!! ఎంతమాట!! ఎప్పుడెప్పుడు!!" అనుచు నాయొద్దికివచ్చెను. పాప మా బ్రాహ్మణుని గుండెలెగిరిపోయినవి. యెవరో "గచ్చాకొట్టేశా" డేమోయనుకొన్నాడు. అయిన నాలోపము నాదే. ఏమందురా—నే నింగ్లీషులోఁ జదువుట—అది యట్లుండఁ జదువునప్పుడు నా మొగము నిస్తేజమై యుండుట. ఇదికూడ నతఁడు చెప్పినదే కాబట్టి, దానిసిఁ గాదనక సరిపెట్టి యూరకున్నాను; మరియుఁ బెద్దవాఁడుగదాయని పప్పులోఁ బడినకాలుగడిగి భావము వెల్లడించితిని. తరువాతఁ బంతులుగారొకరిద్దరితో రహస్యముగా మాటలాడి యానెనుక మాకందరికి సెలవిచ్చిరి.

ఆరోజులలో బిరుదులరుదు; కాబట్టి నేనేవీధిలోఁ బడి వెళ్లుచుండినను ఈమాటలే వినఁబడుచుండెడివి. "ఆసేతు హిమాచల పర్యంతం," "ఆబాల గోపాలం" "ఆపాదమస్తక పర్యంతం"—ఈమాటే. మా సోమయాజులుగారు పంతులుగారికి విశ్వరూపమును విశ్వవ్యాప్తియు జాతకములో నున్నపని చెప్పిరి. సంతర్పణలు, సమారాధనలు, టీపార్టీలు, ఎట్‌హోములు రెండు నెలలవరకు నెడతెరపి లేక మునురుపట్టినవి. ఈ యన్నింటి మాటకేమిగాని మొట్టమొదటి టీపార్టీ గౌరవముమాత్రము మా మిత్రమండలివారిది. ఈ మా మిత్రమండలి పూర్వము పూజా నమస్కారములు లేక బూజుపట్టి యుండెడిదేకాని, యీ దెబ్బతో జిల్లాలో నున్న దొరలకందరికిఁగూడ దానిమహిమ యెరుక పడినది. తక్కిన మిత్రులందరికంటె నే నెక్కువగ వీధిఁబడితిని. అనామకుఁడనైన నాసంతకముతో వెళ్లిన యాహ్వానపత్రము ననుసరించి జిల్లా దొరలందరు సకుటుంబ సపరివార మోటారులై దయచేసి రన్నప్పుడిఁక మనవారిమాట యొక లెక్కయా!! వీరువస్తే నెంత రాకుంటే నెంత!—సరే. ఇక వినతిపత్రము—ఆద్యంతపుణ్యకాలము లైదువందలు—చూడఁబోతే యేమియులే దందులో—ఒక వెండి గొట్టమును అందులో నొక డిమ్మికాగితం! కాని దాని పని వాడి తనంలోనున్నది "మజా" యంతయు. ఆపత్రముం జదువునపుడు నామనస్సు మనస్సులో లేదు. ఆసంగతి యటుండనీ—తరువాత—ఆనాటి కార్యదర్శి క్రమముఁ జెప్పుచున్నాను—నాకష్టము మాట దేవుఁడెరుగుఁ గాని నేను లేకుండిన నంతయు తారుమారై యుండెడిదిదేమో!! అయ్యా! పంతులు వారివెంట నంటియుంటిని : వారియాజ్ఞ ననుసరింపక తీరదు. వారురాగానే ఫిరంగివేయించుటకు నేను—వారికిఁ బుష్పాంజలి యర్పించినది నేను—వారియోగ్యతాపత్రముఁ జదివినది నేను—వారిని దొరల ముందుఁ గూర్చుండఁబెట్టినది నేను—బట్లరు తెచ్చు పళ్లెరములభద్రముగా బల్లలపైఁ బెట్టించుటకు నేను—ఇంతయేల? పంతులవారి నీడవలెనంటి యుంటిననఁ జాలదా! మరియు నటులుండుటవలన నాకుఁ గొంత మేలే యైనది. ఏవందుగా—దొరలు భోజనమెట్లు చేయుదురో కొంతవరకు నాఁడు తెలిసినది—వారు చాకులతోఁ గోసి మేకులతో నోటఁబెట్టుకొందురు. మరియొక విశేషము:—పంతులుగారి ప్రక్కనే కూర్చొనియున్న ఫాక్సుదొర పంతులుగారినిఁజూచి "హౌమచ్ సివిలైజ్‌డ్ యు ఆర్! మిస్టర్ ప్యామ్" అన్నాఁడు!! మరియొకదొర "క్వైట్ సో" అన్నాడు! ఆమాటలకు నాయొడలు పులకరించినది. కేవల మనాగరికులము మనము! ఇట్టి మనవాఁడొకఁడు—అందులో బ్రాహ్మణుఁడు—విశేషించి మంచి నైష్ఠికుఁ—డొకఁ డిట్లు వేషభాషాది విషయంబులం దెల్లవారి మెప్పుఁబడయుట సామాన్యమా? ఊరకే వచ్చునా బిరుదములు? సర్వవిషయముల వారితో మనము లీనమై పోయినపుడే వారు మనలను గౌరవింతురు. సరే! యట్లుండనీ—కాని టీపార్టీమాత్రము అద్వితీయముగా జరిగినది. పంతులుగారి మనోరథము పరిపూర్తిగ నెరవేరినది.

అయ్యా! అదియైన రెండుమూడు దినములకుఁ బిమ్మట నవసరముండి నేను పంతులవారియింటికి వెళ్లితిని. మేడమీద హాలులో వారొక్కరే పడక కుర్చీమీదఁ గూర్చొనియుండిరి. నేను నెదుట నిలువఁబడి "నమస్కార" మన్నాను. వారి శరీరస్థితి యెటు

లుండెనో నే నెరుగను గాని వారు నా నమస్కారము బహుళాయాసమున నెడమచేతితో, నందుకొనలేక యందుకొనలేక, సగము సగముగా నందుకొంటయుఁ జిత్రపుపటమువలె నాసనమున కంటిపెట్టుకొని పెదవిగదలపక రెప్పవేయకయుంటయుఁ జూడం జూడ నాగుండె లెండిపోయినవి. పది పదునేను నిముసములట్లే నిలచియుండి, యిఁకేఁ బ్రమాదించు నేమోయని భయముదోప బిర బిర యింటికి వచ్చుచుండు నంతలో, వారి యావరణదాటియు దాటకమునుపే మా పేరిశాస్త్రి—శ్రీవారి యాత్రికుఁడు—నాముందుకువచ్చి "పంతులవా రేమిచేయుచున్నా"రనియడిగెను. నేను దఃఖముఁబట్టలేక "మరేమున్నది! పంతులవారికిఁ గంటిచూపే గాని నోటమాటలే"దని ఉన్నది యున్నట్టులఁ జెప్పివేసితిని. పాప మా బ్రాహ్మణుఁ డాపట్టుననే వెనుకకు మరలి పరుగులెత్తసాగెను. అతఁ డెవరితో నేమి చెప్పెనో కాని, జనులు తండోపతండములై పంతులవారి యావరణ నిండిరి నేనుమాత్రము నాపనిఁ జూచుకొన బజారునకుఁ బోతిని. అయ్యోయ్యో! నన్నడుగనివాడే నాకుఁ గనఁబడలేదు—"ఏమైనది పంతులుగారికి?" "ఏమైనది" "మొన్న మాతో నంతచక్కఁగా మాటాడుచుండెనే! అయ్యో ఇంతలో నింతచేటా" ' అని ఆబాధపడలేక చెరువుగట్టుమీదికిఁ బోతిని! అక్కడఁ గూడ నీదిక్కుమాలిన గోలయే! ఏమిచేయుటకుఁ దోచక యింటికి సమాచారమంపి యిచ్ఛాపురమునకుఁ బయలుదేరితిని. అయ్యయ్యో! రైలుబండిలో నిదే మాట ఆహా! పత్రికా! యిట్టిదేకద లోకము—గతానుగతికము : నిజము నీ కెరుక; లోకమునకేమి యెరుక ! పట్టి మాటలు గట్టివిగను, గట్టిమాటలు పట్టివిగను గ్రహింపఁ బడుటయే లోకపరిపాటి—ప్రభువులు మొదలు పాకివాండ్రపర్యంత మిదియే యలవాటు. సరియే అదియటుండనిండు. నేను మాత్రము నెలదినములవరకును మా యింటివైపు తిరిగి చూడలేదు.

అటుతరువాత నెట్టెటులో మరలవచ్చి యిల్లు చేరుకొంటిని. కాని పంతులవారి కంటమాత్రము పడ నిశ్చయించుకొనలేదు. అయిన నిది యెట్లు సాధ్యపడును? వారు మేడయెక్కినఁజాలును, వీధులను బెరళ్ళను వారికిఁ గనఁబడుచునే యుండును. ఇఁక నేనెట్లు వారికిఁ గనఁబడకుందును? ఒకనాడు నేను వీధింబడి పోవుచుండ వారు పచారిచేయుచు నన్నుఁ జూచి కేకవైచిరి. నేనును వారిముఖావలోకనభాగ్యపరవశుండనై చేతులెత్తుచుంటిని. కాని నాకంటె నాయనయే ముందుగఁ జేతులెత్తివేసెను. మరియు రమ్మని తలయాడించెను. ఇక నేనెట్లు తప్పించుకొందును? కాళ్లు తడబడుచుండ నెట్టెటులో మేడమీదికిఁబోయి శ్రీవారియెదుటఁ బడితిని. పంతులువారు వెంటనేవచ్చి నాకుడిభుజమంటి 'నీవు మహా చెడ్డ హ్యూమరిస్టువోయ్ పంతులు-నేనేమో యనుకున్నాను-నాదుంపతెంచావే!!' యనుచుఁ దాము కూర్చుండఁబోవుచు నన్నుఁగూడఁ గూరుచుండమనిరి. ఇప్పటికి నాప్రాణములు గూటఁబడినవి! 'బ్రతుకుజీవుఁడా'యనుకొని కూరుచుంటిని. అంతలో మన సోమయాజులును శాస్త్రియునువచ్చి మామ్మాలు మరియాదలందుకొని యుపవిష్ఠులైరి.

పం:—పంతులూ! టీపార్టీ విషయంలో నాకాంప్లిమెంట్సు నందుకోలేదే నీవు

నేను:—అంతా మీదే-యిక నాకెందుకండి బాబూ కాంప్లిమెంట్సు?

పం:—ఐనా అంతచక్కగా నడిపించడంలో విశేషం వున్నాదికాదూమరి! అనుచుండ పంతులుగారి కాఫీనువేళ యైనందున లేచి యందరికిని సెలవిచ్చి పంపిరి.

అయ్యో, యిదిమాపంతులవారి పరలోకయాత్రకుఁ బూర్వరంగనిరూపణ. ఇదియైన మూడుమాసములకుఁ బంతులుగారికి నిజముగాఁ బ్రమాదస్థితి వచ్చినది. పాప మొకనాడు కచేరీలో నుండగానే యకస్మాత్తుగ నూటనాలుగు డిగ్రీలజ్వరము వచ్చినది. వెంటనే వారింటికివచ్చి డాక్టరుగారికి వర్తమానమంపిరి.

బంట్రోతు లిటునటుం బరువులిడుచుండిరి. ఇంతలో 'ఈరాత్రికి వచ్చుచున్నాము. రైలుకు బండిని మనుష్యులను బంపుడు' అని విజయనగరమునుండి యమ్మగారిప్పించిన టెలిగ్రాఫు వచ్చినది. 'ఆవిషయమై నీవు శ్రమపడవాలి పంతులూ'యని శ్రీవారు నాతో ననిరి. నేను గూడ నట్లే యంటిని. ఇంతలో డాక్టరుగారు దయచేసి 'హల్లో!! వాట్స్ ది మేటర్ విత్యూ! మిస్టర్ పామ్' అనుచు వారి మంచము సమీపించెను. కార్యక్రమమంతయు మన మెరిఁగియున్నదేకదా! టెంపరేచరుతీయుట, గుండెపరీక్ష మొదలగునవి యన్నియు నైనవి. ఇఁక మందుకొరకై డాక్టరుగారితోఁ గూడా నొక 'ప్యూను' వెళ్లినాడు. నేను మాత్రము మంచమునకు దగ్గరనే యొకకుర్చీ తెచ్చి వేసికొని కూరుచుంటిని. పాపము! పంతులుగారు నావైపుఁజూచి, 'పంతులూ నీవు మాత్రము నన్ను విడిచిపెట్టనని ప్రామిస్ చెయ్యాలి' యనెను. ఆమాట లాయన చెప్పవలెనా? డాక్టరుయొద్దకేగిన బంట్రోతు మందుతేగానే పంతులుగారి కొకడోసు నోటఁబోసితిని. ఆవెనుక నేనును నాభార్యయుఁ గలసి పంతులవారిబండిని మరియొకబండిని దీసికొని రైలుస్టేషనుకుఁబోయి యమ్మగారిని వారి యమ్మగారిని పరిచారికను దోడ్కొనివచ్చి యిల్లుసేర్చితిమి. అనంతర మారాత్రియంతయు పంతులుగారి చెంతనే యుంటిని. అబ్బబ్బా! ఏమియుష్ణము!! ఆపలవరింత కర్థమేయున్నయెడల - ఛీ ఆమాటలేల యిప్పుడు? అదియుఁగాక పండువంటి బ్రాహ్మణుఁ డట్టి మహాపాపకార్యములను జేయునా? నేను నమ్మను. అందులో నుష్ణపుఁ బలవరింతలు. అందులో నవియుఁ బరధనదారాపహరణాదివిషయికములు !!! రామ రామ!! వద్దువద్దు!! వాటి స్మరణమాత్రమే పాపదాయకము. మనకేల. నేను మాత్రము వారియెడ గౌరవముజూపుట మానను. అది యట్లుండనిండు. ఆ దిక్కుమాలిన యుష్ణము వారముదినములైనను విడువలేదే. సన్నిపాతములోనికి దింపినది. డాక్టరేమి చేయును? మొదట మలేరియాయన్నాడు ఆవెనుక ఫిలడెల్ఫియా యన్నాడు. చివరకు టైఫాయిడ్ అన్నాడు. ఏమన్నను మందు మానలేదు, కాని యామందు గొంతుదిగలేదు. ఇక నాహారము మాట చెప్పనేల? ఇది యిట్లుండ నింక వచ్చెడివారికిఁ బోయెడివారికిఁ జవాబులు చెప్పలేక నాయను మంగలి రాముడుగానికిని గొంతులు రాచిపోయినవి. నా మాటకేమిగాని రాముడుగాని కష్టమే చెప్పితీరవలెను. పంతులుగారి పెద్దబాబు టెలిగ్రాఫులమీద రాగానే నాకు బాధతప్పినది గాని రాముడుగానికి మాత్రం ద్విగుణమైనది. ఆహా! పరిచారకుఁడన వాడే గాక! ఇట్టి కష్టజీవులనుగాంచి యెవడు జాలి పడుచున్నాఁడు?

చదువరులారా! నానోట శనియున్నదని శాస్త్రియును సోమయాజులును ఎన్నెన్ని తిట్టినారో ఆ యీశ్వరునకే యెఱుక; కాని నాయదృష్టవశమున పంతులుగారు మాత్ర మీలోకమునకు వచ్చినారు. క్రమక్రమముగా మంచమువదలి కుర్చీలయొద్దకిని, అచటనుండి వరండాలమీదికిని రాగలుగుచుండిరి కాని మేడ మాత్రము దిగలేదు. డాక్టరు సర్టిఫికేటుపై మూడునెలలు సెలవు-నిండుజీతముతో గూడ-నీయఁబడినది. క్రమక్రమముగా బంధువులు వెళ్ళిరి. రెండునెలలైనవి. ఇక మూడవనెల ప్రవేశించుననగా నొకనాడు పంతులుగారీజీచైరుమీదఁ గూర్చొని సోమయాజులగారితోడను శాస్త్రిగారితోడను మాటలాడుచుండిరి. ఆసమయమున నేనుగూడ వెళ్ళియుంటిని. అప్పటికి వారేదియో పరమార్థ ప్రసంగము గావింపఁ జేయుచుండిరి. నేను విన్నదిది:-

సోమ:—ఆయీశ్వరుడు చాలా దొడ్డవాఁడు!!

శాస్త్రి:—ఆహా!! సందేహమా! లేకుంటే మన కెవరు దిక్కు.

పం:—అయ్యా, దానికేమిగానీ ఒకవిచిత్రమైన సంగతిమాత్రం జరిగింది సుమండీ సోమయాజులు గారూ—

సోమ:—చిత్రం చిత్రం-

పం:—యింతవరకూ కూడా నేనెవ్వరితోనూ చెప్ప లేదు.

శాస్త్రి:—తమకింకా కంఠస్వరము స్ఫుటముగా రాలేదునుండీ.

సోమ:—భయంలేదులే! క్రమంగా అదే కుదటపడుతూంది.

పం:—అయ్యా చూశారూ- పరలోకం అన్నమాట కూడా ఏదో ఒక బూటకమనే తోస్తుంది.

శాస్త్రి:—అది యొకవిశ్వాసం. మనము చూడలేదు కదా—

పం:అం--వుండండి వుండండి నేనుచూశాను! నేను చూచాను. అదే యిపుడు మీతో చెప్ప వస్తున్నాను. నాకావుష్ణం వచ్చిన కొద్దిరోజుల వరకూ ఏమిలేదుకాని తరువాతమాత్రం-ఒకనాడు నన్నెవరో యిద్దరు- చేయిపట్టుకొని లాక్కొని పోయినారు-

శాస్త్రి:—మిమ్ములనా!! మిమ్ములనా!!

సోమ:—ఎంతమాట! తమచేయి!!- పట్టుకోడమా!!- నేనులేకపోయినా నండి-

పం:—ఆతరువాతమరి- యేదో మెరుపుతీగవలె మెరిసింది- నాటకంలో నూశారూ- తెరయెత్తగానే వేషాలుకనిపిస్తాయే ఆలాగే- ఏదో ఒక పెద్ద సింహాసనం- దానిమీద యేదో తేజోమూర్తి-- దానిచుట్టూ పరివారం- అబ్బబ్బా!! యేమిటో చెప్పలేను. నేను చూడలేకపోయినాను కాని ధ్వనిమాత్రం స్పష్టముగా వినబడుతూంది. ఆమాటలు నాకింకా చెవులలో గింగురుమంటున్నాయి. ఐతే ఒకటండీ, నాగరికతమాత్రం లేదని రూఢిగా చెప్పవచ్చును—అదీ—పాశ్చాత్యులకే చెల్లింది- లేకుంటే నన్ను 'ఏమిరా' యంటాడా!!- వాడెంత దివ్యమూర్తియైనా!!-

శాస్త్రి.—అది గర్వపోతుతనం

సోమ—:కాదూమరీ- హేమాహేమీలు- పెద్దపెద్ద దొరలు! బారెడేసి కితాబులిచ్చి బహూకరిస్తూ వుంటే- నదురూ బెదురూ లేకుండా ఏకవచన ప్రయోగమా! నేను లేకపోయినాను-

శాస్త్రి:—మీరుంటే వారి కాజబ్బే రానియ్యరు అప్పుడు-

సోమ-సందేహమా! మృత్యుంజయదండకం చదివేసరికల్లా తోకతెంచుకొని పారిపోవద్దూ- యెంతవాడైనా!

నేను:—మీకు బ్రెయిన్ కూడా కొంచం చెదరినట్టుంది నుమండీ!

పం:—ఏమి చెడినాచెడ్డాదే- ఆతరువాత-విన్నారా శాస్త్రులుగారూ ఆవెనకనుండి యెవడో లోడ లోడమంటూవచ్చి నామొగంమీద మొగంపెట్టి నవ్వుతూ- నిర్భయంగా "సామీ, నాకూతురు బాగున్నదిగదా! నామనుమలను విడిచిపెట్టకుమా" యన్నాడు. ఎవడురాయని చూతునుగదా మాతోటమాలి వీరడు!! నాకేమీ తోచలేదు- లోకము కాని లోకమున్నదా? అక్కడనున్నవాడెవడూ? అనుకొన్నాను- సరే దానికేమి, తరువాత మరియొకచిత్రమండోయ్ సోమయాజులుగారూ!! మీతాతగారికి తండ్రిగారట లోకేశ్వరమసోయాజిగారట—

సోమ:—ఔనౌను.

పం:—ఆయనయే యజ్ఞంచేసినవారట మీవంశంలో

సోమ:—ఔను—అందుకే మాకీ బిరుదు—సోమయాజులని!!

పం:—ఆయనవచ్చి—'ఔరా అబ్బీ, మాసూరిగాడి మరి కూడ నిలువబెట్టితివి' యనుచు నేమేమో చెప్పవచ్చెను కాని దానికేమని యనుకొన్నాను. నేను గదండీ మీయమ్మాయి కేదో జలోదరం లాటి రోగం వచ్చినపుడు డాక్టరుచేత మందిప్పించి బాగుచేయించాను. దానికీ-నన్ను స్తుతిచేయడం మొదలెట్టారు.

నేను:—బాబూ, వారి భాష మనకు బోధపడునా?

పం:—ఏమీ! బోధపడకేమీ! బంగారంలాగ బోధపడుతుంది—

శాస్త్రి:—అదికాక వారేమీ క్రొత్తసంగతులు చెప్పలేదుగా-అంతా జరిగిందే-మన జీవితాంశములోనిదే

పం:—ఆవెనకనే మావదినెగారు!!

సోమ:—మీతో మాటాడింది ఆవిడే-

పం.—ఏమీ మాటాడకేమీ-తెగులు-'శ్యామం, మీయన్నగారి యాస్తి బాగుగా నభివృద్ధి చేసుకొన్నావే! నీకు తెలియలేదు కాని నాకొడుకు నాయొద్దకేవచ్చి చేరినాడు సుమా!! నీదయవల్ల-నీవిక్కడి కెట్లువచ్చితివి?-ఏమటులున్నావు?-నా మొగంవంకః జూడవేమి?— నీవిక్కడ వచ్చితివెట్లు?-ఓధర్మరాజా, నీవు రప్పించితివా ఈయన్నపృథ్వ్యని?' అనుచు నోటికిగాని మాటలాడిందండీ!! చూశారా! జ్ఞాతిశ్చేదనలేనకిమ్మన్నా దూరికేనా!!!

అయ్యా. యీలాగిం కెందరో!! అదంతా చెప్పలేను!! ఇప్పటికి నా కాభయం తగ్గలేదు. డాక్టరుతో చెప్పినాను- ఈభయాని కేదైనా మంచి మందీయమని. అంటే అత డీవాళే పంపించాడు-

ఒరే, రామువూ—మావూ—గోడబీరువాలో పొద్దున్న డాక్టరుగారు పంపిన మందుసీసా తెలునునా?

రాము:—చిత్తం-చూస్తే తెలీదా.

పం—నీమొహం!!-ఇటు చూడు-తెల్లనిసీసా-గుర్రపుబొమ్మవుంటుంది.

రాము:—తెలునును బాబూ-ఇదివరకు నేనిస్తూవున్న దేకదా-

పం:—ఓరె వెధవా!!—ఆమందు కాదిది. ఇది మరొకటీ-

రాము:—చిత్తం తెస్తాను (అనిపోయినాడు)

పం:—అయ్యా! నాకరంటే వీడండీ-దిక్కుమాలిన నాసంసారానికి నిజంగా వీడివంటివాడే లేకుండునా మాసరిగూడ వీధిలో నుండేదే-ఇక నా జబ్బులోనైతే వాడు పడినకష్టం చెప్పతరం కాదు.

నేను:—ఆమాట నిజమండీ బాబూ. వాడి కేమిచ్చి నను ఋణం తీర్చలేము—

పం:—పంతులూ-ఆమాటకొస్తే నీకేమిచ్చి నీఋణం తీర్చుకోగలను?—ఎక్కడికీ ఋణాలకి!! ఋణం వుంటేనే వారు మనవంటివాళ్లకి చాకిరీ చెయ్యాడం—లేకుంటే యెవడుగుతాడు యీవక్షలను!!

రాముడు:—మందు తెచ్చాను బాబు.

పం:—అక్కడుంచు—ఓరే చూవూ, వారికికూడా లెమనేడ్డుబుడ్లు తేచ్చి

నేను:—నా కక్కరలేదండీ—అలవాటే లేదు.

సోమ:—ఆదేమిటయ్యా! అలాగంచావు—మాకు మాత్ర మలవాటా? వారిచ్చినపుడు పుచ్చరాదు. అది మరికూడా గాదు

పం:—అటువంటి ధర్మసూక్ష్మాలు మీవంటి పెద్దలకు తెలియవాలి—పశువువాళ్లకు తెలుస్తాయా?

రాముడు గాజుగిన్నెలలో తెమినేడు పోసి సోమయాజులగారి కివ్వబోవుచుండెను.

పం:—ఒరే—జాగ్రత—వారిని ముట్టుకొంటావు! మంగలి ముండాకొడుకా! క్రింద పెడితే వారు తీసుకొంటారు.

రాముడు:—చిత్తం చిత్తం.

పం:—ఓరె రామువూ—అన్నట్టూ—నీకు బహుమతీ చేసిన పట్టుకండువా మనవాళ్ళకి చూపించావూ?

రాము;—లేదు—చూపిస్తా—యిదో.

నేను:—నీటులకు చుట్టివుంటే మాకేలాగరా తెలుస్తుంది ?

రాము:—లేదుబాబూ అక్కడక్కడ అంచులున్నాయి! కొగ్గేస్తుంది బాబూ.

పంతు:—చూశావా పంతులూ యీ వెధవకి సిగ్గట—రాస్కెల్—ఇచ్చినగానితో తృప్తిపడడం లేదు—అందుకే వీళ్ళదరిద్రం తీరదు.

పంతులూ ఒకనాడు—మనలో మాట—నేను మా దొరగారి టికి వెళ్ళినప్పుడు ఆయన బట్టలుసర్దుకొంటూ వున్నాడు. నేనూ వెళ్ళగానే 'రండీ, కూర్చోండి' యన్నాడు అంతలో వొకమేజాజోడు—స్టాకింగ్స్—కనబడ్డాది. అతనికేం బుద్ధిపుట్టిందో "మిస్టర్ ప్యామ్, ఐలైక్ టు ప్రెజంట్యూ విద్దిస్" అన్నాడు. "యస్ యువరానర్" అన్నాను వెంటనే.—ఏదిచ్చినా పుచ్చుకోవాలి! అదే మనకుధర్మం!! భగవంతుడైనా "పత్రంపుష్పం" అన్నాడు గాని "పట్టువస్త్రం బంగారం కడియం" అనలేదు.

నేను:—చిత్తం చిత్తం—సెలవిప్పించండి-బజారుకు వెళ్లవాలి.

పం:—ఏం తొందరయ్యా—కూర్చో—ఏ మీలా గొచ్చావు—అడగడం మరచి పోయినాను.

నేను:—ఏమీ లేదు—ఊరకే వచ్చాను—ఇంతలో మీరేదో చెప్పుతూవుంటే వింతగావుందని వింటూ కూర్చోబడ్డాను.

పం:—అయితే వుండు మరి—వెళతానంటావేం?

నేను:—ఇంకా కొంచం వున్నాడాయేమి?

పం:—విశేషంలేదులే—ఇదుగో మందుపుచ్చుకొనీ-చెప్తా—ఊపిరి యింకా అందకుండావుంది పంతులూ—(అని మందు పుచ్చుకొనుచు, శాస్త్రివైపు జూచి) ఏమిటి శాస్త్రులుగారూ ఆకాగితాల మడత?—పంచాంగమా?

శాస్త్రి:—కాదు కాదు ఆంధ్రపత్రిక.

పం:—ఆహాఁ! మీకూవట్టిందీ చాదస్తం!—ఎందుకండీ యీ దిక్కుమాలిన పత్రికలు— చదువగలిగితే యింగ్లీషు పత్రికలు చదవాలి.

రాము:—మా తమ్ముడు శీతిగాడికిదే ప్రాణం బాబూ. అదిలేకుంటే సస్తానంటాడు.

పం:—ఏడిశారుగాడిదెలు. అందుకే యీలాగైంది మనబ్రతుకు. సరే మనకెందుకులెండి—విన్నావూ పంతులూ! ఆతరువాత చెప్పడానికి మరేమీలేదుగాని ఆ ఫూల్ అన్నమాటేనాకు మరచినామరపురాలేదు. రెండునెలంతర్వాత నన్నుపిలచి తీర్పులు చెపుతాడట.

సోమ:—ఏడిశాడు—నేను రుద్రయజ్ఞంచేసి వాడి పని పట్టిస్తానండండి! మీరే వెళ్లడమో వాడే మీదగ్గిరికి రావడమో తెలుస్తుంది.

నేను:—మీలో నట్టి ప్రభావంవుండేదని విన్నాము; కాని యిపుడెట్లాగుందో.

శాస్త్రి:—ఇపుడుమాత్ర మేమైంది! చేయాలంటే మూడులిప్తలు.

పంతులు:—ఒరే రాముడూ, నీవు నేనుచెప్పిన సీసాలో మందేతెచ్చావా?

రాముడు:—లేదుబాబూ-అదేతెచ్చాను. అదేఅదే.

పం:—ఏడిశావురా వెధవా—పరిగెత్తి డాక్టరును పిలూ—ఊపిరందలేదు-గుండెలాడలేదు. పంతులూ, భయంవేస్తూంది పట్టుకో...............

అనుచుఁ గన్నులు వేలవేసెను. తల భుజములమీది కొరగినది. సోమయాజులును శాస్త్రియు "ఏమైంది పంతులూ ఏమైంది" యనుచు దూరమునకు బోయి యడుగుచుండిరి. నేను బట్ట నడుమునకు బిగించుకొని పంతులుగారిని పట్టుకొంటిని: పాదములంటితిని : తల యాడించితిని—శ్రీమన్నారాయణ !!! వెంటనే క్రిందనున్నవారికిఁ గేకలువేసితిని. మరికొంతసేపటికి డాక్టరుగారు కూడ దయచేసినారు. వారు వెంటనే పరీక్షించి పెదవులు విరచివైచిరి. ఇదియేమని నేనాయన నడిగితిని. ఆయన చిరచిరలాడుచు "హో ఇటీస్ నథింగ్ బట్ విస్కీరియా" అని బిరబిరఁ బోయినాడు.

నాలుగు లిప్తలలో నలువదేడుల నాటకము సమాప్తమైనది. అయ్యో! మంచి చెడ్డలేయుండును.